నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల



కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఈవీఎంలను అప్పగిస్తున్న సిబ్బంది


కరీంనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు

## జూన్ 4 వరకూ ఉత్కంఠ

పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. అన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన తర్వాత జూన్ 4న కౌంటింగ్ చేయనుండగా, అప్పటిదాకా అభ్యర్థులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అయితే, ఫలితాల కోసం మునుపెన్నడూ లేనంత ఉత్కంఠ నెలకొన్నది. ఆయా పార్టీల అభ్యర్థులు అప్పుడే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. నిజానికి ఉదయం 9 గంటల పోలింగ్ సరళిని పరిశీలించిన ప్రధాన పార్టీల నాయకులు.. అప్పటి నుంచే ఆయా పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఫోన్‌చేస్తూ.. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నారు. ఇంకా క్షేత్రస్థాయి అంటే గ్రామస్థాయిలోని శ్రేణులకు కూడా ఫోన్ చేస్తూ లోతుగా విశ్లేషిస్తున్నారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థులు.. తమ పార్టీ శ్రేణులను పిలిపించుకొని.. మండలాల వారీగా లెక్కల తీస్తూ అంచనా వేసుకుంటున్నారు. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# లోక్‌సభ పోరు ప్రశాంతం



కరీంనగర్: సప్తగిరికాలనీలో గుర్తింపుకార్డులను చూపుతున్న ఓటర్లు



## కరీంనగర్‌లో 72.33 శాతం.. పెద్దపల్లిలో 67.80 శాతం పోలింగ్

- ఉదయం నుంచే కదిలిన ఓటర్లు • మధ్యాహ్నం నుంచి కాస్త మందగింపు
- తిరిగి సాయంత్రం బారులు • పలుచోట్ల ఈవీఎంల మొరాయింపుతో అంతరాయం • రాత్రి వరకు కొనసాగిన పోలింగ్ • గతానికి మించి పెరిగిన ఓటింగ్ శాతం • పర్యవేక్షించిన అభ్యర్థులు, ఎమ్మెల్యేలు
- స్ట్రాంగ్ రూంలకు చేరిన ఈవీఎంలు • ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ఫలితాలపై ఉత్కంఠ.. జూన్ 4 వరకూ ఎదురుచూపులే..

*పార్లమెంట్ పోరు ప్రశాంతంగా ముగిసింది. కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జోరుగా సాగినా.. ఆ తర్వాత రెండు మూడు గంటలపాటు కాస్త మందగించి తిరిగి సాయంత్రం పుంజుకున్నది. ఎండలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు తరలివచ్చి ఓటేయడంతో ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. కరీంనగర్ పరిధిలో 72.33 శాతం, పెద్దపల్లి పరిధిలో 67.80 శాతం నమోదైంది. మొత్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకోగా, అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లో నిక్షిప్తమైంది. వచ్చే నెల 4న కౌటింగ్ జరగనుండగా, అప్పటి దాకా ఉత్కంఠ నెలకొననున్నది.*


జగిత్యాల కృష్ణానగర్‌లో ఓటేసేందుకు బారులు తీరిన ప్రజలు

కరీంనగర్, మే 13, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ పెద్దపల్లి (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ సమరం ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు ఘటనలు మినహా సజావుగా సాగింది. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలతోపాటు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 దాకా పోలింగ్ సాగింది. ఎండల నేపథ్యంలో ఈసారి మరో గంట పాటు అదనంగా అంటే సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిచ్చింది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం రెండు మూడు గంటలపాటు కాస్త మందగించినా.. తిరిగి నాలుగు గంటల నుంచి ఓటర్లు పోటెత్తారు. 6 గంటల వరకూ బారులు తీరారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురిలోని పలు సెంటర్లలో రాత్రి 7 గంటల వరకు ఓటు వేశారు. పోలింగ్ సరళిని కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి, పెద్దపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలను పరిశీలించడంతోపాటు ఎప్పటికప్పుడు వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. ఇటు పార్లమెంట్ అభ్యర్థులు పలుచోట్ల కేంద్రాలకు వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### పెరిగిన పోలింగ్ శాతం

ఈసారి రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ పోలింగ్ శాతం పెరిగింది. కరీంనగర్ పరిధిలో మొత్తం 17,97,150 మంది ఓటర్లుండగా, 72.33 శాతం ఓటింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 17,13,618 మంది ఓటర్లకు 11,90,861 మంది ఓటు వేయగా, 69.49 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, పెద్దపల్లి పార్లమెంట్‌లో ప్రస్తుతం 15,96,430 మంది ఓటర్లుండగా, 10,82,379 మంది (67.80శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో 14,78,062 మంది ఓటర్లకు గానూ 9,70,842 మంది (65.58 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇటు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో 71.33 శాతం (రాత్రి 10 గంటల వరకు) పోలింగ్ నమోదైంది. అయితే, పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారనుందనే అంశంపై అంతటా జోరుగా చర్చ సాగుతున్నది.



### స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలు

పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ఈవీఎంలను పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూములకు తరలించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఈవీఎంలను కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఈవీఎంలను మంథని జేఎన్‌టీయూ కళాశాలకు తరలించారు. అలాగే మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి పరిధిలోని ఈవీఎంలను హాజీపూర్ మండలం లోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచారు.


మోడల్ పోలింగ్ బూత్‌లో మహిళలు


సిరాగుర్తును చూపుతున్న థర్డ్‌జెండర్స్

### ఊపిరి పీల్చుకున్న అధికారులు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల అధికారులు రంగంలోకి దిగారు. ముందు నుంచే ఎన్నికలకు సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించడంతోపాటు సమాయత్తం చేశారు. పోలీస్ అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాలతోపాటు నిజామాబాద్ పరిధిలోకి వెళ్లే జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూశారు. ఎక్కడా రీపోలింగ్‌కు అవకాశం లేకుండా, సమస్యాత్మక ప్రాంతాల్లో సైతం ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ఫోన్లను అనుమతించలేదు. పలు పోలింగ్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యతో ఈవీఎంలు మొరాయించినా, వెంటనే వాటిని సరిచేసి ఎక్కడా అంతరాయం లేకుండా చేశారు. మొత్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ఇటు అధికారులు, అటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


కరీంనగర్: పోలింగ్ కేంద్రం వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి పమేలా సత్పతి


పెద్దపల్లి: రంగంపల్లిలో వృద్ధుడికి సహాయం చేస్తున్న ఎన్నికల అధికారి ముజామ్మిల్‌ఖాన్


ఓదెల: కనగర్తి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


ఓటేసిన అనంతరం సిరా గుర్తును చూపుతున్న కరీంనగర్ బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వినోద్‌కుమార్, రాజేందర్‌రావు, సంజయ్


ఓటేసిన అనంతరం సిరా గుర్తును చూపుతున్న పెద్దపల్లి బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కొప్పుల ఈశ్వర్, గడ్డం వంశీకృష్ణ, గొమాసె శ్రీనివాస్

### కరీంనగర్‌లో ఇలా

పార్లమెంట్ పరిధిలో ఉదయం 9 గంటల వరకు 10.01 శాతం, 11 గంటలకు 26.14 శాతం, ఒంటి గంటకు 45.11 శాతం, మూడు గంటలకు 58.24 శాతం, ఐదు గంటలకు 67.70 శాతం, 6గంటలకు 72.33 శాతం పోలింగ్ నమోదైంది.

### పెద్దపల్లిలో..

పార్లమెంట్ పరిధిలో ఉదయం 9 గంటలకు 8.42 శాతం, 11 గంటలకు 25.57 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 44.4 శాతం, 3 గంటలకు 55.6 శాతం, సాయంత్రం 5 గంటలకు 64.8 శాతం నమోదైంది. ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మంథని, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌లో 4 గంటల వరకే పోలింగ్ గడువు ఉండగా, ఆ తర్వాత వచ్చిన ఓటర్లను అనుమతించలేదు.

# సీబీఎస్ఈ ఫలితాల్లో పారమిత విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, మే 13 : సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో పారమిత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపారు. పారమిత హెరిటేజ్ పాఠశాలలో పది, 12వ తరగతి పీసీఎం, పీసీబీ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ ఈ ప్రసాదరావు తెలిపారు. పది ఫలితాల్లో మన్హా మెహ్వాష్ 97.47 అగ్రగామిగా నిలువగా, లక్ష్మి హాసిని 95.6 శాతం, నందన్ ప్రణవ్ 95.2 శాతం, స్ఫూర్తి 95 శాతం, ఆశిష్ 94.6 తర్వాతి స్థానాల్లో నిలిచారు. 46 శాతం విద్యార్థులు 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు చెప్పారు. కాగా, 12వ తరగతి ఎంపీసీలో గట్టు మనస్విని 94 శాతం, నిర్మల కృష్ణ తేజ 91 శాతం, దేశిని సహర్ష్ 90 శాతం సాధించారు. బైపీసీలో బొమ్మడి శివ 95 శాతం, అయాన్ 91 శాతం, బీఈఏలో శ్రేష్ట 82 శాతం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ ప్రసాద రావు అభినందించారు. ఇక్కడ ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.




